# నిద్దరపోతా సావీ!

ప్రతి దినాము కార్ల కిందా, లారీల కిందా పడి సస్తన్న వాళ్ళంతా ఏవైపోతుండారో, నిన్ననో, మొన్ననో పాపాఘ్నిలో కొట్టుకు పోయినోరంతా ఏ తీరానికి సేరిపోయుండారో, నాకు అర్తంకాలేదు కానండయ్య, పాతికేళ్ళ మట్టీ ఓ బతికున్న శవం... అవునండయ్యా దాన్ని శవమే అంటారండయ్యా, అది మటుకు ఈదులెంటా, బతికున్న జనాల మద్దెన తిరుగాడతా వుంటే మటుక్కు ఎవ్వరూ కనిపెట్టలేక పోయినారయ్యా. అదీ ఆళ్ళ తప్పేలా అవుద్దిలేండి. ఆ బతికున్న శవం అంటే నేనూ, వూరు తెల్లారక ముందే లెగిసిపోయి పిట్టపురుగులేని ఈదులెంబడి నడుసుకుంటూ పోయి నాకిళ్ళీ బడ్డీ తెరుస్తానయ్య. నాకు అచ్చరం ముక్క రానంత మాత్తరాన, అచ్చరాలు నేర్చుకున్న మారాజులు సదూకోటం ఆపేస్తారా? ఆకాశం నేల బడిపోద్దా? మరింక నేను కిళ్ళీ బడ్డీ తెరిసి, నిద్దర్లేవబోయే దశవంతుల కోసం సక్కంగా అన్ని పేపర్లు తగిలించేస్తానయ్య.

అల్లా తెల్లతెల్లంగా ఈదులగుపించే యాళకి మాయాడది కాళ్ళీడుసుకుంటూ తాంపాకులు తడిగుడ్డలో సుట్టుకొని దాన్ని కన్నోడ్ని, కట్టుకున్నోడ్ని శాపాలెట్టుకుంటూ

వచ్చేసరికి కిళ్ళీబడ్డీ కళకళలాడిపోయేట్టుగా పిసరు దుమ్ము లేకుండా దులిపేసి సిగిరెట్లు, బీడీకట్లూ, వక్కపొడి దండలు, సీసాలు, బోసాలు సరిది పెట్టేసి, నా కొట్టు ఇల్లా గట్టుపై నుంటాది కదా గట్టు కిందదాకా తాళ్ళు కట్టేసి మాసపత్రికలు, దినపత్రికలు, అయినీ పేర్చేస్తానయ్య. ఓరి సింహాద్రిరీ, అచ్చరం ముక్క రానెదవా, అయ్యేలా అమ్ముతావురా అనకండయ్యా... బొమ్మసూసి, పుస్తకం బరువు పోల్చి అచ్చరాల వరస కళ్ళతో సిన్మా సూసినట్టు సూసేసి, ఆటి ధరలు పోల్చేయగల్ను సార్! ఇదేం గొప్పలేండి. ఈది సివరి సెట్టు కాడికి అల్లా గట్టెనక నుంచి గుడ్డోడొకడు అడుక్కోటానికి సిప్పా, కర్రా అట్టుకొని నా మాదిరే తెల్లారకుండానే తయారైపోతాడు. ఆడు ఈదీ ఈది రాళ్ళు, గోతులు, డ్రయినేజీలు అన్ని కళ్ళున్నోళ్ళకన్నా సులాగ్గా పసిగట్టేస్తాడయ్యా. తాంపాకులు తెచ్చిన మాయాడదాన్ని కాసేపు ఆ కొట్టుకాడ అత్యకేసులో ఇరికించినట్టు ఇరికించేసి అప్పుడో గంట నా సొంత పన్లు సూసుకొనేందుకు పారొస్తానయ్యా. ఇంతదాకా వచ్చినంక సెప్పకపోవడం కానండయ్యా ఆ వేళకి నాకు సేబదులు ఇచ్చిన నర్సిమ్ములు మావా, షావుగారి గుమస్తా, పొద్దున్నే ఈడు కొట్టుకాడే దొరక్క సస్తాడా అని వచ్చేస్తారయ్య. ఆళ్ళని బురిడీ యెయ్యడం కోసం ఇంటికాడికి పరుగుదీసి అటుట్టు మొకం తోవి, ఉంటే రెండు సెమ్ములు నీళ్ళు గుమ్మరించుకొని, మా ఈది మొగదలో అట్లుపోసే కావేరమ్మ కాడ, పోతే పోయినయ్ లెమ్మని నాలుగు అట్లు లాగించి కొట్టుకాడికి వస్తానయ్యా. సేసిన పాపం సెపితే పోద్దని ఈ విషయం మనవిసేసా. నేనట్టా దొంగ తిండి తింటానేగానీ, నా పెళ్ళాం, బిడ్డలు మట్టుకు అట్టాంటి ఎదవ పని సెయ్యరయ్యా. ఏ పండక్కో, పబ్బానికో ఏవన్నా తింటారంతే. ఆళ్ళ కాడ పైసలు ఏడ్నుంచి వస్తాయ్ కనక. రోజుకి మాయాడదాని సేతిల తిండి కరుసుకి సరిపడా రూపాయలు ఎడితేకొల్ల. మా ఇద్దరు పిల్లగాళ్ళు నాస్తా పెట్టినంత కాలం బళ్ళకి పోయినారు. ఆమైన అచ్చరాలు రుద్దటం తప్పించి ఇంక ఇషేష లాభం లేనప్పుడు ఆ పలకలు, బలపం పుల్లలు కరుసు మనవల్ల గాదని సెప్పి ఒకడ్ని షెడ్లో ఎట్టినా, ఇంకోడు నా కొట్టు ముందర పంచర్లు ఏసుకొనే సుబ్బారావు కాడ కుదురుకున్నాడు. సుబ్బారావు కూటికి పోయినప్పుడు, టీనీళ్ళకి పోయి ఒక్కోపాలి ఆడనే గప్పాలు కొడతా కూర్చున్నప్పుడు పంచర్ల బేరాలొస్తే, మా పిల్లగాడు సాలా కంతిరోడు లేండి, ఆడు సాలా సులాగ్గా నిమిషాల మీద పంచర్లు లాగించి పావలా, అర్ద లాగుతుంటాడు. అయ్యి పాపం ఆడి జేబుల్లో దాసుకోను కుదరక నా సేతిలోనే ఏసేస్తా ఉంటాడు. ఈ వైభోగపు కాపురం ముచ్చట్లు. అయ్యేయెూ భారతం, భాగోతం లాగా తమరికి ఇనిపించాలని కాదు కానండయ్యా ఇయ్యాళ నేను సాలా సంతోషంగున్నానయ్యా. సాలా సమత్సరాల మట్టీ, దినాము నేను కోరుకునే కోరికొకటి ఈ దినం తీరబోతుందయ్య. ఆ ముచ్చట సెప్పాలనే ఇయ్యాళ ఈ నిసిరాతిరి ఏళ, ఒక్కడ్నీ ఈ నాలుగు రోడ్ల కూడలిలో నండయ్య నిలబడుకొని ఉన్నా. ఇక్కడ్నించి నాలుగు తావులు తీసుకుపోయ్యే రోడ్లు అగుపిస్తా వున్నాయండీ. నేనెళ్ళేది ఏ తావుకి? ఇప్పుడు తమరు ఆ

విషయం తేల్సాల. తమరికి మొత్తం సంగతి ఇవరిస్తా. సరింగా పాతికేళ్ళనాడు మా మావ, మా మాలచ్చిని నా సేతిలోబెట్టి, పదేలు ఆడిరకతం, కష్టార్జితం నాకు దారపోసి 'అరె సింహాద్రీ కూలి బతుకు సేసి, సేసి అలుపొచ్చేసినాదిరా. నీకు మటుకు ఈ దినగండం వద్దురా సావీ! ఇల్లా ఈ పదేలెట్టి కిళ్ళీ బడ్డీ ఎట్టుకో అయ్యా, మొగుడు పెళ్ళాలు దానిపైన కష్టం చేసి దరిజాగా బతకండిరా' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. అదిగో ఆ పదేలతో ఈ కిళ్ళీబడ్డీ పనిలోకి దూకినా. ఇంక వయసులో ఉన్న పెళ్ళాన్ని బట్టించుకున్నానా? ఇద్దరు ముద్దుకూనల్ని ఎత్తి దించినానా?, సినిమాలు, షికారులు, సరదాలు, ఆటిజోలికిపోతే నీసెప్పున గొట్టు. తెల్లారకముందే కొట్టు తెరిసి రాచ్చసుడి మాదిరి అద్దరేతిరికీ కొట్టుమూయడం. ఆ నిద్దరేటకి పెళ్ళావేందో, బిడ్డలేందో, తిండేందో, తిప్పలేందో, వయసులో సుకపడే రోజులన్నీ నిద్రమత్తుతోనే తెల్లారిపోనాయి. పేరుకి నాకది పెళ్ళాం, కాపురం, దాని మొకం, అందచందాలు సూసినానా? ముద్దు ముచ్చట్ల తీర్చినానా? బతుకు సెర్నాకోలపెట్టి ఎనకాల కొట్టినట్లు తరువుతా ఉంటే ఇంటిల్లపాదీ పరుగులు పెట్టినం. అప్పులు జేయడం అలవాటైపోయె. తీరుస్తం సంగతి. వుంటే ఆపైవాడి కెరుక. అక్కడిదాకా ఎందుకు సావీ ఈరాసావిగోరికాడ పదేలు తెచ్చినా. ఆయనగారికి ఇప్పుడికి అసలు పదేలూ, వడ్డీ కిందిరవై ఏలు జమే సేతలకి తలపండిపోనాది. 'ఏందిరా మీరంతా బంగారం తింటారా' అంటారు తమరు. లెక్కలు సూసుకుంటే , తాంపాకులు, జర్దా, బాబా వంద రకాలేడిసినయ్. ఆటిధరలు, నేను పుట్టి పెరిగినట్లు సంవత్సరం సంవత్సరం పెరుగుతూనే ఉండాయయ్యా! ఆకు మడిసే తీరు, రాసే సున్నం, ఏసే జర్దా, మారదా! ఇంకపోతే సిగరెట్లు, బీడీలు, పేపర్లుకి, పదేళ్ళనాటి కమీషనే ఈనాటికీ. దినామూ యాభై రూపాయలు కళ్ళసూస్తే ఇంటిల్లిపాది కడుపు నిండా బువ్వదింటవేకొల్ల. ఇంకా బాకీలు గట్టేది సాద్దెవా? ఇంక సాకిరి సంగతి ఇనండి. మా ఇంటి దానికి వర్సాకాలానికి నడుంనొప్పి జాస్తయిపోతందయ్యా. అసలు దాన్నడువు ఈపాటికే  వంగిపోయింది. పేపర్లు, పుస్తకాలు తగిలిస్తానా, వర్షం జల్లు అల్లల్ల వస్తాదనుకోండి. అది పరుగు పందేల్లో ఎళ్ళినట్లు ఉరకలెయ్యాల్సిందే. పొద్దస్తమానం ఆ ఇరుకు బడ్డీలో కూర్చుని కూర్చుని నాకు మోకాళ్ళొంగవు. పడుసుదనంలో వున్నట్లు అది పాతికేళ్ళ తరువాత ఉరుకులెత్తగలుగుతుందా? వానజల్లు కొడితే పాపం అది నన్నూ, పుట్టింటివాళ్ళని అళ్ళని కన్నాళ్ళనీ వరసలు వరసలుగా దీవిచ్చిందంటే నమ్మండి. మా బతుకులకి ఎండావానా సలి ఏదీ లేదు. కళ్ళు తిరిగే ఎండగాసినా రేకు బడ్డీ వదిలేందుకు లేదు. సలితో కొంగర్లు పోయినా అద్దరేతిరి దాకా బడ్డీ మూసిందీ లేదు. ఈ కాలాలన్నింటికీ మా కళ్ళు మొకం, కాళ్ళు గోళ్ళు ఇంక ఎన్ని రకాలుగా రంగు మారుసుకొన్నాయో, మిమ్మల్ని ఒకోపాలి మా సుట్టాలే మూడగనే గుర్తుపట్టరు. ఇదిగిదిగో ఈ జానెడు పొట్ట చేసే కలిమాయతో మా కన్నీపట్టలేదయ్యా. అయితే సివరాఖరికి మా కట్టాలన్ని సినిమాలో శుభం అని ఏసేసినట్లు ఈయాల పొద్దుటాలే ఓ పని జరిగిపోనాది. రోడ్డు ఎడల్పు చేస్తాం ఇకారంగా ఉన్న ఈ బడ్డీలన్నీ తీసేయమని

మునిసిపాలిటీ వారు, నెలల నుంచి సెపుతూనే వున్నారయ్యా ఆ... ఆళ్ళిట్టా అంటానే ఉంటారు మనమిట్టా ఉంటూనే ఉంటావు అని మేమంతా దీమాగా రోజులు నెట్టుకొస్తున్నామా? ఈయాళ మట్టుకీ రోజునెట్టినా జరగలేదయ్యా. పొద్దుటేల మా కిల్లీ బడ్డీ మున్సిపాలిటీ వాళ్ళు లారీలో పడేసి ఎత్తికెళ్ళారయ్యా. ఏ మాటకామాటే సెప్పాలయ్యా సామాన్లు వద్దిగ్గా క్రింద నెట్టేసి బడ్డీ జాగ్రత్తగా యాడకో మా బ్రతుకు బాగుపడేతావున ఊరికి దూరంగా కట్టిన బిల్డింగులో ఎడతానన్నారయ్యా. ఆమైన పొద్దుటేల నుంచి, నా పెళ్ళాం గొంతు ఆర్పుకు పోయేట్టు అరిసి, తిట్టి ఏడిచి సాయంకాలానికి నీరసం వచ్చి సామానులు మూట కట్టుకొని బిడ్డల నెత్తిన దాన్నెత్తిన ఎట్టుకొని ఇంటికాడ కెళ్ళిపోయిందయ్యా. ఇయ్యన్ని సర్దుకోనేంత జాగ ఆడలేదనుకోండి ఏది ఏమైనా ఆళ్ళు ఎళ్ళి పోయినాక ఈ కూడలిలో నిలబడినా, రేపటికి బడ్డీ ఇస్తారా? వడ్డీ డబ్బు కట్టకపోతే షావుకారు ఊరుకుంటాడా? రేపటికి కూడూ కుమ్మా ఉంటదా? నా పెళ్ళాం ఏడుపాపిందా లేదా? బిడ్డలు నోటంట రెండు మెతుకులు ఏసుకున్నారా లేదా? ఇయన్ని ఓ పక్కనెట్టి నేనీడ నిలబడుకున్నా.

పాతికేళ్ళబట్టి నే కోరుకున్నదొకటే కోరిక. కళ్ళ నిండుకూ నిద్రపోవాలి సామీ! నిద్రపోవాల. రేపటేలకి సీకటి సీకటితో లేచి పోవక్కర్లా. కష్టాలు, బాధలు, సోకండాలు ఇవన్నీ అవతలబెట్టి మా ఈదరుగు మీదకు పోయి నిద్దర తీస్తా. అయితే నే మనవి చేసే దేటంటే ఇంటికి నేనే దోవన పోవాలో సెప్పండయ్యా. ఇది రోడ్డు కూడలి. నాలుగు దార్లున్నాయి. పాడికళ్ళతో పాతికేళ్ళబట్టి నేను గుడిసె నుంచి నడిచొచ్చిన రోడ్డా? అప్పులోళ్ళని తప్పించుకుపోయిన ఆ రోడ్డా? మా పిల్లగాడు దొంగ పంచర్లు ఏస్తావుంటే సుబ్బిగాడు వస్తాడేమో అని నిక్కి నిక్కి దారిగాసిన ఈ రోడ్డా? మూట నెత్తిన పెట్టుకొని నడుస్తా ఉన్న మా మావ ఎనకాల సేమంతి పూలెట్టుకొని అందెలు కడియాలు మోగుతుంటే నా ఇంటికి కాపురాని కొచ్చి ఈ దరిద్రం సెగలకి మాడిపోయిన నా పెళ్ళాం నడిసిన ఈ దారెంటనా? సెప్పండి దొరా ఏ దారిన నడిచిపోయి నా నిద్దర తీరుసుకోనూ?

★

పాన్‌వాలా ప్రత్యేక సంచిక